క్లుప్తంగా

నేడు పొలిటికల్ సైన్స్ విభాగం సెమినార్‌హాల్ ప్రారంభం

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని పొలిటికల్ సైన్స్ విభాగం పూర్వ విద్యార్థుల రూ.6 లక్షల విరాళంతో ఓ గదిని అన్ని హంగులతో అలుమ్ని సెమినార్ హాల్‌గా తీర్చిదిద్దారు. దాన్ని ఈనెల 9న ఉదయం వీసీ ప్రొఫెసర్ ప్రతాప్‌రెడ్డి ప్రారంభించనున్నారు.

డాల్ఫిన్ బార్, రెస్టారెంట్ సీజ్



వరంగల్: హనుమకొండ సుబేదారిలోని డాల్ఫిన్ బార్ అండ్ రెస్టారెంట్‌కు సంబంధించిన ఆస్తి పన్ను రెండేళ్ల నుంచి చెల్లించకపోవడంతో బల్దియా అధికారులు శనివారం సీజ్ చేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ కమిషనర్ రవీందర్ మాట్లాడుతూ డాల్ఫిన్ బార్ అండ్ రెస్టారెంట్ యాజమాన్యం రెండేళ్లుగా బల్దియాకు రూ.2 లక్షల 56 వేల ఆస్తి పన్ను బకాయిలను చెల్లించాలని కోరుతూ పలుమార్లు నోటీసులు జారీ చేసినా స్పందించలేదని అన్నారు. ఇటీవల రెడ్ నోటీసు అందజేసినా స్పందించకపోవడంతో కమిషనర్ ఆదేశాల మేరకు సీజ్ చేసినట్లు వివరించారు. కార్యక్రమంలో ఆర్‌ఓ యూసుఫొద్దీన్, ఆర్ఐ దేవరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

ఈస్ట్‌జోన్ డీసీపీగా అంకిత్ కుమార్ బాధ్యతల స్వీకరణ

వరంగల్ క్రైం: రవీందర్ నుంచి వరంగల్ పోలీస్ కమిషనరేట్ ఈస్ట్‌జోన్ డీసీపీగా అంకిత్ కుమార్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా అంకిత్ కుమార్‌ను ఈస్ట్ జోన్ పరిధిలోని పోలీస్ అధికారులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు.

విజయ్‌కుమార్‌కు భారత్ విభూషణ్ అవార్డు

వరంగల్: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని విజన్ నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్, జీసీఎస్ వల్లూరి ఫౌండేషన్ వరంగల్ ఎస్ఆర్‌నగర్‌కు చెందిన ప్రజా కళాకారుడు దామెర విజయ్‌కుమార్‌ను భారత్ విభూషణ్ అవార్డుకు ఎంపిక చేశారు. హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో ఫౌండేషన్ నేషనల్ చైర్మన్, ఫౌండర్ డాక్టర్ శ్రీనివాసరాజు చేతుల మీదుగా ఆదివారం అవార్డు అందుకోనున్నారు.

ఆదివాసీ హక్కుల పోరాట సంఘీభావ వేదిక ఏర్పాటు



నయీంనగర్: ఆదివాసీ హక్కుల సంఘీభావ వేదిక వరంగల్ జిల్లా శాఖను హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో శనివారం జరిగిన సమావేశంలో రాష్ట్ర కమిటీ బాధ్యులు గడ్డం లక్ష్మణ్, నారాయణరావు, జక్కుల వెంకటయ్య, చంద్రమౌళి ప్రకటించారు. కన్వీనర్లుగా రమాదేవి, కళ, రాజీ, వెంకట నారాయణ, శివ, రమేష్‌చందర్, ఉదయ్‌సింగ్, రాజ్‌మహ్మద్, అనిశెట్టి రజిత, సాయికిరణ్, బాలరాజ్, దయాకర్, క్రాంతి, ఇంద్రసేన, శాంతక్కను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సమావేశంలో పార్టీలు, ప్రజా సంఘాలు, మేధావులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు శాస్త్రవేత్తలుగా ఎదగాలి



ఖిలా వరంగల్: విద్యార్థులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకొని శాస్త్రవేత్తలుగా ఎదగాలని కేయూ రిటైర్డ్ ప్రొఫెసర్ డాక్టర్ రామేశ్వరం సూచించారు. వరంగల్ 17వ డివిజన్ స్తంభంపెల్లిలో ఏపీఎస్ పాఠశాలలో చైర్మన్ అంకతి వీరస్వామి ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ అంకతి సాగర్ అధ్యక్షతన జాతీయ సైన్స్ డే వేడుకలను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన ఎగ్జిబిట్లను ఆయన పరిశీలించారు.

మళ్లీ ఉత్సవ కమిటే

14 మందితో ఎర్రగట్టు గుట్ట కార్యవర్గం

హసన్‌పర్తి: ఎర్రగుట్టు వేంకటేశ్వరస్వామి జాతరకు ఈసారి మళ్లీ ఉత్సవ కమిటీని నియమించనున్నారు. గతేడాది కూడా కేవలం డైరెక్టర్లతోనే ఉత్సవాలు నిర్వహించారు. రెండు నెలల క్రితమే జాతర శాశ్వత కమిటీకి నోటిఫికేషన్ విడుదల చేశారు. అయితే సరైన సమయంలో కమిటీ దరఖాస్తు చేసుకోలేదు. గడువు దాటిన తర్వాత దరఖాస్తు చేసుకోవడంతో ఆ దరఖాస్తులను అధికారులు పరిగణిలోకి తీసుకోలేదు. కాగా, హోలీ పండుగ నుంచి ఐదు రోజుల పాటు ఉత్సవాలు కొనసాగనున్నాయి. ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు ప్రత్యేక చొరవతో ఈసారి మళ్లీ ఉత్సవ కమిటీ ఏర్పాటు చేయనున్నారు. ఇందులో హసన్‌పర్తి, భీమారం గ్రామాల నుంచి ఆరుగురు చొప్పున డైరెక్టర్లతో కూడిన జాబితాను సిద్ధం చేశారు. కమిటీగా చైర్మన్‌గా హసన్‌పర్తికి చెందిన ఆరెల్లి వెంకటస్వామి పేరును ప్రతిపాదించారు. నేడోరేపో ఉత్తర్వులు వెలువడనున్నట్లు సమాచారం.

ఘనంగా మహిళా దినోత్సవం

అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నగర వ్యాప్తంగా శనివారం ఘనంగా జరుపుకున్నారు. ఈమేరకు మహిళలను సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాల్లో రాణించాలని ఆకాంక్షించారు. ప్రతీ అవకాశాన్ని అందిపుచ్చుకుని ఆర్థికంగా ఎదగాలని వివరించారు.

– సాక్షి నెట్‌వర్క్



నిట్‌లో సైంటిస్ట్ వెంకటమణికి జ్ఞాపిక అందజేసి సన్మానిస్తున్న నిట్ ప్రొఫెసర్లు



ఆర్టీసీ హనుమకొండ డిపోలో ఆర్టీసీ ఆర్ఎం విజయభాను, మహిళా ఉద్యోగులు



వరంగల్ వ్యవసాయ కళాశాలలో మహిళా దినోత్సవ వేడుకల్లో కేక్ కట్‌చేస్తున్న విద్యార్థిని



మహిళా ఉద్యోగులతో మాట్లాడుతున్న టీజీఎస్పీ బెటాలియన్ ఇన్‌చార్జ్ కమాండెంట్ ఎంఐ సురేష్



భీమారంలో మహిళా గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులతో ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి



డీసీసీ భవన్‌లో కేక్ కట్‌చేస్తున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి సతీమణి నీలిమారెడ్డి



పారిశ్రామిక వేత్తలు, స్వయం సహాయక సంఘాల మహిళలను సన్మానిస్తున్న బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు కొలను సంతోష్‌రెడ్డి



హనుమకొండలోని ప్రభుత్వ ప్రాక్టీసింగ్ హైస్కూల్‌లో మహిళా ఉపాధ్యాయులను సన్మానిస్తున్న జీటీఏ బాధ్యులు



మడికొండలో మహిళా పోలీసులను సన్మానిస్తున్న ఇన్‌స్పెక్టర్ కిషన్, సిబ్బంది



కాజీపేటలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి సతీమణి నాయిని నీలిమారెడ్డి



49వ డివిజన్ కార్పొరేటర్ మానసను సన్మానిస్తున్న కాపు మహాసభ ప్రతినిధులు



మహిళా దినోత్సవం సందర్భంగా కాజీపేట రైల్వే స్టేషన్‌లో ప్రతిజ్ఞ చేస్తున్న సిబ్బంది



షీటీమ్స్ సీఐ సుజాతను సన్మానిస్తున్న హనుమకొండలోని ఏకశిల యాజమాన్యం



13వ డివిజన్‌లో మహిళా దినోత్సవంలో కేక్‌కట్ చేస్తున్న మాజీ కార్పొరేటర్ శారదాజోషి

మహిళలు అన్నిరంగాల్లో రాణించాలి

● ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి



జాయింట్ డైరెక్టర్లను సన్మానిస్తున్న ఎమ్మెల్యే

కేయూ క్యాంపస్: పురుషులతో సమానంగా మహిళలు అన్నిరంగాల్లో రాణించాలని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో కాకతీయ యూనివర్సిటీలోని పద్మాక్షి మహిళా హాస్టల్‌లో శనివారం నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో ఆయన మాట్లాడారు. రాణిరుద్రమదేవి పోరాట పటిమను ప్రతిబింబించేలా పట్టుదలతో చదువుకొని ఉన్నతస్థానానికి చేరుకోవాలని ఆకాంక్షించారు. యూనివర్సిటీల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు. గత ప్రభుత్వం యూనివర్సిటీలను నిర్వీర్యం చేసిందని విమర్శించారు. కాకతీయ యూనివర్సిటీ అభివృద్ధి డిటైల్డ్ ప్రాజెక్టు రిపోర్టును సీఎంకు దృష్టికి తీసుకెళ్లినట్లు గుర్తుచేశారు. హాస్టళ్ల మహిళా జాయింట్ డైరెక్టర్లను ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి కుమార్తె డాక్టర్ గోదారెడ్డి సన్మానించారు. కార్యక్రమంలో కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రామచంద్రం, హాస్టళ్ల డైరెక్టర్ ప్రొఫెసర్ రాజ్‌కుమార్, యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు అలువాల కార్తీక్, గోవింద్, కేయూ పాలకమండలి సభ్యులు డాక్టర్ చిర్ర రాజుగౌడ్, నాయకులు డాక్టర్ గజ్జెల మల్లేష్, డాక్టర్ సూరాసి కృష్ణ, డాక్టర్ తీగల ప్రేమ్‌చందర్ పాల్గొన్నారు.

అతివలను మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం



పారిశుద్ధ్య కార్మికులతో దాస్యం వినయ్‌భాస్కర్

హన్మకొండ: మహిళలను కాంగ్రెస్ పార్టీ మోసం చేసిందని మాజీ చీఫ్ విప్, బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని హనుమకొండ ఎన్జీఓఎస్ కాలనీలో 58వ డివిజన్ మహిళా పారిశుద్ధ్య కార్మికులను శనివారం సన్మానించి బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం మహిళల ఓట్లు దండుకొని వారిని మోసం చేసిందన్నారు. ప్రతినెలా మహిళలకు రూ.2,500 ఇస్తామని చెప్పి ఏడాదిన్నర గడిచినా అతీగతి లేదని విమర్శించారు. వృద్ధులకు రూ.4 వేలు, వికలాంగులకు రూ.6 వేల పెన్షన్ ఇస్తామని చెప్పి ఇవ్వలేదని అన్నారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ ఇమ్మడి లోహితరాజు, నాయకులు పులి రజినీకాంత్, కొండపాక రఘు, స్నేహిత్, రఘు పాల్గొన్నారు.

వంటిల్లు బాధ్యతను సమానంగా పంచుకోవాలి



సదస్సులో మాట్లాడుతున్న సుమిత్రాదేవి

విద్యారణ్యపురి: వంటిల్లు బాధ్యతలను స్త్రీ, పురుషులు సమానంగా తీసుకోవాలని డీటీఎఫ్ రాష్ట్ర అకడమిక్ సెల్ సభ్యురాలు సుమిత్రాదేవి అన్నారు. హనుమకొండ, వరంగల్ జిల్లాల డీటీఎఫ్ శాఖల ఆధ్వర్యంలో హనుమకొండ జులైవాడలోని వసతిగృహంలో శనివారం నిర్వహించిన సదస్సులో ఆమె మాట్లాడారు. అంతర్జాతీయ శ్రామిక మహిళా పోరాట దినం.. ప్రాసంగిత అనే అంశంపై ఎస్.అనిత, విద్య – మహిళా సాధికారత అనే అంశంపై ఎస్.సుధారాణి, స్త్రీలు – పితృస్వామిక సమాజం అనే అంశంపై సుమ మాట్లాడారు. డీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, వరంగల్ జిల్లా అధ్యక్షుడు గోవిందరావు, ములుగు జిల్లా అధ్యక్షుడు ఆదిరెడ్డి, రాష్ట్ర కౌన్సిలర్ ఉప్పలయ్య, బాధ్యులు మహేందర్‌రెడ్డి, సుదర్శనం, రఘుశర్మ, హెచ్‌డబ్ల్యూఓలు జ్యోతి, రాజమణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మహిళలకు సన్మానాలు కాదు రక్షణ కల్పించాలి



మాట్లాడుతున్న ఉప్పలయ్య

● సీఐటీయు జిల్లా అధ్యక్షుడు ఉప్పలయ్య

హన్మకొండ చౌరస్తా: మహిళలు, మహిళా కార్మికులకు కావాల్సింది సన్మానాలు, సత్కారాలు కాదని, పని ప్రదేశాల్లో రక్షణ కల్పించాలని, కనీస వేతనం అమలు చేయాలని సీఐటీయూ హనుమకొండ జిల్లా ఉపాధ్యక్షుడు ఉప్పలయ్య సూచించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మహిళా కార్మికుల సభను పబ్లిక్ గార్డెన్‌లో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పురుషులతో సమానంగా మహిళలకు వేతనాలు అమలు చేయాలని దశాబ్దకాలం క్రితం పుట్టిన ఉద్యమం నేటికీ కొనసాగుతోందని అన్నారు. ప్రభుత్వాలు మేల్కొని ఇప్పటికైనా మహిళలకు రక్షణ, కనీస వేతనాలు అమలు చేయాలని కోరారు. మున్సిపల్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర కమిటీ సభ్యురాలు ఎం.నవనీత అధ్యక్షతన జరిగిన సమావేశంలో మున్సిపల్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు బరుపట్ల మహేష్, సుజాత, అనిత, విజయ, ప్రమీల, సువర్ణ పాల్గొన్నారు.

యూజీసీ బిల్లును ఉపసంహరించుకోవాలి

● కేయూ స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ వెంకయ్య



సమావేశంలో మాట్లాడుతున్న వెంకయ్య

కేయూ క్యాంపస్: యూనివర్సిటీల స్వయంప్రతిపత్తిని దెబ్బతీసే యూజీసీ ముసాయిదా బిల్లును కేంద్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని కాకతీయ యూనివర్సిటీ స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ ప్రొఫెసర్ వెంకయ్య డిమాండ్ చేశారు. ప్రగతిశీల ప్రజాస్వామిక విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) ఆధ్వర్యంలో హనుమకొండలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ఆడిటోరియంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కాషాయీకరణ చేస్తోందని విమర్శించారు. పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీకాంత్, రాష్ట్ర కార్యదర్శి నాగరాజు మాట్లాడుతూ రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వానికి విద్యారంగంపై చిత్తశుద్ధి లేదని ఆరోపించారు. సుమారు రూ.7 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను చెల్లించలేదని వాపోయారు. అనంతరం ఉమ్మడి వరంగల్ జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్ష, కార్యదర్శులుగా గుర్రం అజయ్, మర్రి మహేష్, కోశాధికారిగా పవన్, ఉపాధ్యక్షుడిగా సుమంత్, సహాయ కార్యదర్శిగా సందీప్ ఎన్నికయ్యారు. సమావేశంలో పీడీఎస్‌యూ ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి మర్రి మహేష్, బాధ్యులు బండి కోటేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

అన్నిరంగాల్లో సమానత్వం కావాలి

కేయూ క్యాంపస్: మహిళలకు అన్నిరంగాల్లో సమానత్వం కావాలని కాకతీయ యూనివర్సిటీ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగం రిటైర్డ్ ప్రొఫెసర్ వి.శోభ అన్నారు. లింగ సమానత్వం – అభివృద్ధి అనే అంశంపై శనివారం నిర్వహించిన సమావేశంలో ఆమె విస్తృతోపన్యాసం చేశారు. మహిళలు ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాల్లోనూ సాధికారత సాధించాలని సూచించారు. అనంతరం పారా ఒలింపిక్స్‌లో పతకం సాధించిన రీసెర్చ్ స్కాలర్ డి.రమాదేవి, రిటైర్డ్ ప్రొఫెసర్ శోభను సన్మానించారు. విభాగం అధిపతి ప్రొఫెసర్ శ్రీనివాస్‌రావు, బీఓఎస్ చైర్మన్ డాక్టర్ శ్రీనివాసులు, అధ్యాపకులు డాక్టర్ లింగయ్య, డాక్టర్ శ్రీను, డాక్టర్ శ్రీను, డాక్టర్ మోహన్, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు



ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

కాజీపేట: చైతన్యపురికాలనీలోని పద్మావతి, గోదాదేవి సమేత వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు కనులపండువగా సాగుతున్నాయి. వేడుకల్లో భాగంగా రెండోరోజు శనివారం వేదపండితుల ఆధ్వర్యంలో యాగశాలలో హోమంలో అగ్ని ప్రతిష్ఠ, ధ్వజస్తంభం వద్ద ధ్వజారోహణం చేసి మూర్తి కుంభస్థాపనం చేశారు. ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు పంజాల అశోక్‌కుమార్ గౌడ్, మేజర్ వడ్డెపల్లి నరేందర్.. భక్తులతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. డప్పు, వాయిద్యాలతో ఉత్సవ విగ్రహాలను ఆలయ పండితులతో కలిసి శేష వాహనంపై పుర వీధుల్లో ఊరేగించారు. పండితులు భేరీపూజ, దేవతాహ్వానం, నిత్యహోమం, శ్రీమద్రామాయణ వెంకటాచల మహత్య పారాయణం, సామూహిక లక్ష్మీ అర్చనలు జరిపించారు. దేవతామూర్తులకు అర్చకుడు శ్రీనివాసాచార్యులు ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు చేశారు.

డంపింగ్ యార్డు సమస్యను పరిష్కరించాలి



సంతోష్‌రెడ్డి, రావు పద్మకు వినతిపత్రం అందజేస్తున్న అడ్‌హక్ కమిటీ సభ్యులు

మడికొండ: మడికొండ – రాంపూర్ గ్రామాల మధ్య ఉన్న డంపింగ్ యార్డుతో మడికొండ, రాంపూర్ గ్రామస్తులతో పాటు పలు గ్రామాలకు చెందిన ప్రజలు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని, అనారోగ్యం బారిన పడుతున్నారని అడ్‌హక్ కమిటీ సభ్యులు తెలిపారు. ఈక్రమంలో డంపింగ్ యార్డు సమస్య పరిష్కారానికి కృషి చేయాలని బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు సంతోష్‌రెడ్డి, మాజీ అధ్యక్షురాలు రావు పద్మకు శనివారం వినతిపత్రం అందజేశారు. కాగా, డంపింగ్ యార్డు సమస్యపై రాంపూర్ గ్రామంలో సమావేశాన్ని ఆదివారం నిర్వహించనున్నట్లు అడ్‌హక్ కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో సభ్యులు తొటిరెడ్డి కరుణాకర్‌రెడ్డి, పొనగోటి వెంకట్‌రావు, తాడూరి మోహన్, బొల్లికొండ రవీందర్, వినోద్, దువ్వ నవీన్, పెండ్లి కృష్ణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

రిటైర్డ్ ప్రొఫెసర్లను మళ్లీ విధుల్లోకి తీసుకోవద్దు



కేయూ లైబ్రరీ ఆవరణలో నినాదాలు చేస్తున్న విద్యార్థి సంఘాల బాధ్యులు

కేయూ క్యాంపస్: యూనివర్సిటీల్లో ప్రొఫెసర్లుగా విధులు నిర్వర్తించి రిటైర్డ్ అయిన వారిని మళ్లీ విధుల్లోకి తీసుకోవాలనే యోచనను ప్రభుత్వం విరమించుకోవాలని కాకతీయ యూనివర్సిటీలోని వివిధ విద్యార్థి సంఘాల బాధ్యులు డిమాండ్ చేశారు. ఈమేరకు కాకతీయ యూనివర్సిటీలోని లైబ్రరీ ఆవరణలో శనివారం నిర్వహించిన సమావేశంలో విద్యార్థి సంఘాల బాధ్యులు మాట్లాడారు. పీజీలు, పీహెచ్‌డీలు పూర్తిచేసిన ఎంతోమంది నిరుద్యోగులు ఉద్యోగాల కోసం ఎదురు చూస్తున్నారని తెలిపారు. ఈక్రమంలో యూనివర్సిటీల్లో పార్ట్‌టైం, పర్మనెంట్ అధ్యాపకుల నియామకాలకు నోటిఫికేషన్ ఇవ్వాలని కోరారు. యూనివర్సిటీల్లోని సమస్యలను పరిష్కరించాలని పేర్కొన్నారు. సమావేశంలో ఎంఎస్ఎఫ్ కేయూ ఇన్‌చార్జ్ డాక్టర్ వడ్డెపెల్లి మధు, బీఆర్ఎస్వీ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ అరూరి రంజిత్, ఏబీఎస్ఎఫ్ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు మంద నరేష్, కన్వీనర్ డాక్టర్ మద్దిరాల మోహన్‌రెడ్డి, బాధ్యులు లాపాక సురేష్, అనిల్, సునీల్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

ప్రజా సమస్యలను విస్మరిస్తున్న పాలకులు

వరంగల్: ప్రజా సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విస్మరించి వినాశనకర విధానాలతో పాలన కొనసాగిస్తున్నాయని ఎంసీపీఐ (యూ) జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్ అన్నారు. నగర ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని నగర కార్యదర్శి సుంచు జగదీశ్వర అధ్యక్షతన అండర్ బ్రిడ్జి ప్రాంతంలోని ఓంకార్ భవన్‌లో శనివారం నిర్వహించారు. సమావేశంలో నాయకులు నర్ర ప్రతాప్, ప్రభాకర్, నరసయ్య, మల్లికార్జున్, నలివెల రవి, ఐలయ్య, గోవర్ధన్‌రాజు, నరసయ్య, శివ, అనూష తదితరులు పాల్గొన్నారు.

భూ కబ్జాదారులపై చర్య తీసుకోవాలి

ఖిలా వరంగల్: నకిలీ డాక్యుమెంట్ సృష్టించి భూకబ్జాకు పాల్పడిన కబ్జాదారులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని భూ బాధితురాలు కె.రజితకుమారి తెలిపారు. ఈమేరకు ఖిలా వరంగల్ మండలం స్తంభంపెల్లి గ్రామ శివారు భూమిలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. 362/1 సర్వే నంబర్‌లోని ఐదు ఎకరాల భూమికి కొంతమంది నకిలీ డాక్యుమెంట్ సృష్టించి కబ్జాకు యత్నించడంతో తాము హైకోర్టులో అప్పీల్ చేసుకోగా.. ఆ నకిలీ డాక్యుమెంట్‌ను రద్దు చేస్తూ తమకు సర్వహక్కులు కల్పిస్తూ తీర్పు వచ్చిందని తెలిపారు. ఫోర్జరీ సంతకాలతో నకిలీ డాక్యుమెంట్ సృష్టించిన భూ కబ్జాదారులపై చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

జాబ్‌మేళాను వినియోగించుకోవాలి

హన్మకొండ చౌరస్తా: నాయిని విశాల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈనెల 23వ తేదీన హనుమకొండలోని వాగ్దేవి కళాశాల ఆడిటోరియంలో నిర్వహించనున్న జాబ్‌మేళాను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి సూచించారు. ఈమేరకు బాలసముద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జాబ్‌మేళాకు సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి సతీమణి నీలిమారెడ్డి, కుమార్తె డాక్టర్ గోదారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముస్లింలకు ప్రాధాన్యమివ్వాలి

నయీంనగర్: ఎమ్మెల్సీ ఎన్నికల్లో ముస్లిం మైనార్టీలకు స్థానం కల్పించి అన్ని పార్టీలు తమ చిత్తశుద్ధిని చాటుకోవాలని ముస్లిం యూనిటీ డెవలప్‌మెంట్ మూవ్‌మెంట్ అధ్యక్షుడు అబ్దుల్ సుభాన్ డిమాండ్ చేశారు. హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పెద్దల సభలో ఖాళీ అవుతున్న ఐదు స్థానాల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు మైనార్టీలకు అవకాశం కల్పించాలని కోరారు. మహ్మద్ మొయినొద్దీన్, అబ్దుల్ మెహియుద్దీన్ పాల్గొన్నారు.

రామచంద్రం మృతి ప్రజా ఉద్యమాలకు లోటు

వరంగల్: తెలంగాణ విప్లవ వీరనారి చిట్యాల ఐలమ్మ మనుమడు, పాలకుర్తి మాజీ సర్పంచ్ చిట్యాల రామచంద్రం మృతి ప్రజా ఉద్యమాలకు తీరని లోటని సీపీఐ నేత, బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు ఒక ప్రకటనలో తెలిపారు.

రామన్నపేటలో కంటి వైద్యశిబిరం

రామన్నపేట: నగరంలోని 29వ డివిజన్ రామన్నపేటలో ఉచిత కంటి వైద్యశిబిరాన్ని పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి సతీమణి నీలిమారెడ్డి శనివారం ప్రారంభించారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

కాజీపేట: కాజీపేట పట్టణంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను కార్పొరేటర్లు విజయశ్రీ రజాలీ, జక్కుల రవీందర్ యాదవ్ శనివారం ప్రారంభించారు. కాజీపేట చౌరస్తా నుంచి సోమిడి బొడ్రాయి వరకు రోడ్డు నిర్మించనున్నారు. కుమారస్వామి, తబ్బు, బిలాల్, కర్ణాకర్, కుమార్, విజయ్ పాల్గొన్నారు.

ఊర చెరువును పరిరక్షించాలి

హసన్‌పర్తి: 56వ డివిజన్ గోపాలపురంలోని ఊర చెరువును పరిరక్షించాలని స్థానికులు కోరారు. ఈమేరకు స్థానిక ఎమ్మెల్యే కేఆర్.నాగరాజుకు శనివారం వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చెరువులోని బఫర్ జోన్, ఎఫ్‌టీఎల్‌లలో రోజురోజుకు అక్రమ నిర్మాణాలు ఎక్కువవుతున్నాయని పేర్కొన్నారు.

తాళ్ల పద్మావతిలో ఆకట్టుకున్న హాస్యం

ఖిలా వరంగల్: వరంగల్ ఉర్సుగుట్ట సమీపంలోని తాళ్ల పద్మావతి ఇంటర్నేషనల్ హైస్కూల్‌లో తాళ్ల పద్మావతి విద్యాసంస్థల చైర్మన్ తాళ్ల మల్లేశం ఆధ్వర్యంలో డైరెక్టర్లు తాళ్ల వరుణ్, వైష్ణవి అధ్యక్షతన గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్‌పై శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మిమిక్రీ కళాకారుడు సంతోష్‌కుమార్ హాజరై చేతిలో బొమ్మను పట్టుకుని మిమిక్రీ చేస్తూ హాస్యంతో నవ్వులు పూయించారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

ఖిలా వరంగల్: ఇంటికి తాళం వేసి విదేశాలకు వెళ్లగా గుర్తు తెలియని వ్యక్తులు ఇంట్లోకి చొరబడి సుమారు రూ.2 లక్షల విలువైన బంగారు ఆభరణాలు అపహరించుకుపోయారని ఇన్‌స్పెక్టర్ వెంకటరత్నం తెలిపారు. వరంగల్ ఉర్సు బొడ్రాయి కరీమాబాద్‌కు చెందిన మంగ కోటేశ్వర్ తన ఇంటికి తాళం వేసి ఇటీవల విదేశాలకు వెళ్లాడు. శుక్రవారం అర్ధరాత్రి గుర్తుతెలియని ఆ ఇంట్లోకి ప్రవేశించి బీరువాలోని బంగారు ఆభరణాలు చోరీ చేశారు. బాధితుడు కోటేశ్వర్ మామ నాగపూరి భిక్షపతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ వివరించారు.

ఉర్సు గుట్టలో బైక్ చోరీ

వరంగల్ ఉర్సుగుట్ట హంటర్ రోడ్డులోని గణపతి ఇంజనీరింగ్ కళాశాల ప్రాంగణంలోని షైన్ కళాశాల ప్రాంగణంలో పార్కు చేసిన బైక్ చోరీకి గురైనట్లు మిల్స్‌కాలనీ ఇన్‌స్పెక్టర్ వెంకటరత్నం తెలిపారు. పరకాలకు చెందిన కోరే కుమార్ వరంగల్ షైన్ కళాశాలలో అధ్యాపకుడిగా విధులు నిర్వహిస్తున్నారు. రోజువారీగా బైక్‌పార్కు చేసి శుక్రవారం సాయంత్రం విధులు ముగించుకుని వచ్చి చూసేసరికి బైక్ కనిపించలేదు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ వివరించారు.

శ్రీచైతన్య పాఠశాలను మూసివేయాలి



హన్మకొండ: అనుమతి లేని శ్రీచైతన్య పాఠశాలను మూసివేయాలని యూఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మాలోతు రాజేష్ నాయక్ డిమాండ్ చేశారు. ఈమేరకు హనుమకొండలోని అంబేడ్కర్ విగ్రహం కూడలిలో శనివారం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇష్టానుసారంగా విద్యార్థుల నుంచి అధికంగా ఫీజులు వసూలు చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని వాపోయారు. శ్రీచైతన్య పాఠశాలకు నక్కలగుట్ట పరిధిలో సెంచరీ స్కూల్ పేరుతో అనుమతి ఉంటే శ్రీచైతన్యగా మార్చుకొని విద్యార్థుల తల్లిదండ్రులను మోసం చేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో యూఎస్ఎఫ్ఐ నగర అధ్యక్షుడు రాకేష్, అరుణ్, మూర్తి, రోహిత్, ప్రవీణ్, మహేష్ పాల్గొన్నారు.